క్లుప్తంగా

గణనాథునికి గరిక పూజ


ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: మండలంలోని సంపర పంట కాలువ సమీపంలో గల ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకుని ఆలయంలో పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి బుధవారం గరిక పూజ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

9న మండల పరిషత్ సాధారణ సమావేశం

రంగంపేట: ఈ నెల 9న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.వెంకటరత్నం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

డయేరియా మరణాలను నివారించడమే లక్ష్యం


ఈలకొలనులో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

రంగంపేట: అతిసార మరణాలను నివారించడమే లక్ష్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా మండల పరిధిలోని ఈలకొలను అంగన్‌వాడీ కేంద్రం –1ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించిన డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా కలుషిత నీరు, ఆహారం, చేతుల శుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది గంగరాజు, ఆశా వర్కర్ దేవీపార్వతి, అంగన్‌వాడీ వర్కర్ చంద్రావతి, సహాయకురాలు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

పెదపూడి: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా, పూల్‌రాయ్ గ్రామంలో జరిగిన దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు కోరారు. జి.మామిడాడలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం బుధవారం నిర్వహించిన సమావేశంలో హత్రాస్ ఘటనలో మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ బోలేబాబా సత్సంగ్ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు దుర్మరణం పాలవ్వడం చాలా బాధాకరమన్నారు. నిర్వాహకులపై హత్యా నేరం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధి బొచ్చా ఏసు పాల్గొన్నారు.

మెకానిక్ డే వేడుకలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ గ్రామంలో మెకానిక్ మండల అసోసియేషన్ అధ్యక్షుడు వానపల్లి సూరిబాబు, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు సోనీ ఆధ్వర్యంలో బుధవారం మెకానిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మెకానిక్లను గుర్తించి ఆదుకోవాలని మెకానిక్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో జుత్తుక కృష్ణ, తమలంపూడి శివరామారెడ్డి, జుత్తుక సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు


ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో ఐఎఫ్‌పీ విక్టర్ ఇన్ జీసస్ చర్చిలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలు పాటించి సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ జుత్తుక విక్టర్ శామ్యూల్, ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్‌జాన్‌డేవిడ్, కార్యదర్శి బి.ప్రేమసాగర్, ట్రెజరర్ కె.విల్సన్‌బాబు, తోట విజయరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో మిశ్రమ ఫలితాలు


సీతానగరం లంకభూమిలో పాకలో ఆరబెట్టిన నాటు పొగాకు

- లంక పొలాల్లో పంటకు నష్టం
- డిసెంబర్‌లో గరువు భూముల్లోని పంటకు లాభం
- నాటు పొగాకు నిల్వ చేసిన రైతులకు అధిక ప్రతిఫలం

సీతానగరం: నాటు పొగాకు రైతులకు ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు అందించింది. లంక భూముల్లో పొగాకు దిగుబడి లేక సాగు చేసిన రైతులు నష్టాల పాలయ్యారు. గరువు ప్రాంతంలో సాగు చేసిన పొగాకు అధిక దిగుబడితో రైతులు లాభాల బాటపట్టారు. 30 కిలోల లంక పొగాకును చట్టల్లో వేసి కడతారు. పుట్టుకు 8 చట్టలు, ఒక చట్ట 30 కిలోలు ఉంటుంది. మూడు పుట్లు ఒక గరిసె. గరిసెకు 720 కిలోలు ఉంటుంది. ప్రస్తుతం గరిసె పొగాకు ధర రూ.2 లక్షల వరకు ఉంది. పొగాకు నిల్వలున్న రైతులు కొద్దిమంది మాత్రమే మిగలడంతో వారు మంచి లాభం పొందారు.

లంక భూముల రైతులకు నష్టం

సెప్టెంబర్‌లో ఏర్పడిన తుఫాన్ కారణంగా లంక పొలాల్లో రైతులు మూడుసార్లు పొగాకు ఏతలు (నాట్లు) వేయాల్సి వచ్చింది. దీనితో రైతులు ఎకరానికి రూ.30 వేలు ఖర్చు చేశారు. ఎకరానికి శిస్తు రూ.40 వేలు, పెట్టుబడి రూ.1.30 లక్షలు ఖర్చు చేశారు. ఎకరానికి కేవలం 10 నుంచి 12 చట్టలు దిగుబడి వచ్చింది. ఆ సమయంలో గరిసె (720 కిలోలు) పొగాకు ధర 1.20 లక్షల నుంచి రూ 1.30 లక్షలు ఉంది. దీనితో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకూ మాత్రమే ఆదాయం వచ్చింది. రైతుకు ఖర్చులన్నీ తీసివేయగా ఎకరానికి రూ 1.05 లక్షలు నష్టం కలిగింది. లంక భూమిలో పొగాకు చేసిన రైతులు నష్టాల పాలైయ్యారు.

గరువు పొలాల్లోని పొగాకుకు డిమాండ్

ఖరీఫ్‌లో వరి పంట అనంతరం డిసెంబర్‌లో వేసే రెండవ పంటగా పొగాకును కొంతమంది రైతులు వేశారు. లంక భూముల్లో మాదిరిగానే గరువు భూముల్లో పొగాకు సాగుకు అంతే ఖర్చు అవుతుంది. గరువు భూముల్లో ఎకరానికి దిగుబడి సుమారుగా 40 చట్టలు నుంచి 45 చట్టల వరకు వచ్చింది. ఈ పొగాకుకు గరిసె (720 కిలోలు) ధర ఆ సమయంలో రూ.1.50 లక్షల నుంచి క్రమేపీ పెరుగుతూ రూ.2 లక్షల వరకు చేరుకుంది. దీనితో గరువులో వేసిన పొగాకు పంటకు రైతులు లాభం పొందారు. ఎకరానికి ఖర్చులు పోగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు లాభం పొందారు. ఇలా లంక భూమిలో వేసిన పొగాకు పంటకు నష్టం రాగా, గరువు పొలాల్లో సాగు చేసిన పొగాకు పంటకు మంచి లాభం వచ్చింది.

అప్పు తెచ్చి సాగు చేశా



మూడు ఎకరాల లంక భూమిలో పొగాకు పంట వేశాను. ఎకరానికి పెట్టుబడి రూ 1.70 లక్షలు ఖర్చు యింది. మిచాంగ్ తుఫాన్ కారణంగా మూడుసార్లు ఏతలు వేశాను. అధిక పెట్టుబడి అయింది. ఎకరానికి దిగుబడి 12 చట్టల దిగుబడి వచ్చింది. రూ 1.20 లక్షలు ధర ఉండటంతో కేవలం ఎకరానికి రూ. 60 వేలు ఆదాయం వచ్చింది. ఎకరానికి రూ.1.10 లక్షల నష్టం ఏర్పడింది. మూడు ఎకరాలకు రూ.3.30 లక్షలు నష్టం వచ్చింది. వడ్డీకి అప్పులు తెచ్చి పంట సాగు చేశాను.

– కొమ్మిరెడ్డి రామకృష్ణ, సీతానగరం, నాటు పొగాకు రైతు

లాభం వచ్చింది



వరి చేను కోతలు కోసిన అనంతరం రెండు ఎకరాల్లో నాటు పొగాకు పంట వేశాను. ఎకరానికి రెండు గరిసెలు పైగా దిగుబడి వచ్చింది. గరిసె ధర రూ.1.50 లక్షలున్న సమయంలో పొగాకు విక్రయించాను. ఎకరానికి ఖర్చులు పోను రూ.1.60 లక్షలు లాభం వచ్చింది. ఇప్పుడు గరిసె ధర రూ.2 లక్షల వరకు ఉంది. కొంత మంది రైతులు పొగాకు నిల్వ వేశారు. వారికి మరింత లాభం వస్తుంది.

– ఎస్ దుర్గారావు, లంకూరు. నాటు పొగాకు రైతులు

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి


గంద్రేడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

పెదపూడి: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. పెద్దాడ, ఏపీత్రయం గ్రామాల్లో జెడ్పీ ఉన్నత, గంద్రేడులో ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో పఠన, లేఖన నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు పంపన సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన


సీతానగరం పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్

సీతానగరం: సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా ఏపీడీ బి.రామ్‌ప్రసాద్ పరిశీలించారు. బుధవారం పీహెచ్‌సీని పరిశీలించేందుకు వచ్చిన మండల స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్‌కు పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 24 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శ్లాబ్ పాడైందని, కొద్దిపాటి వర్షానికి పై కప్పు నుంచి నీరు కారుతోందని తెలిపారు. బెడ్‌లు పాడైపోయాయని, పైప్‌లైన్ పాడవడంతో నీరు రావడం లేదని, విద్యుత్ ఉపకారణాలు షార్ట్ సర్క్యూట్ అవుతున్నాయని, రీవైరింగ్ చేయాలని డాక్టర్ చైతన్య స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు. శ్లాబ్ లీకేజీలను అరికట్టేందుకు భవనంపై రేకుల షెడ్డు నిర్మించాలని ఇరువురు అభిప్రాయపడ్డారు. బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణిని పీహెచ్‌సీ స్థితిగతులపై మండల స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్ ఆరా తీశారు.

ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు

జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు


పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి రామానాయుడు

సీతానగరం: పురుషోత్తపట్నం, తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకాల నుంచి రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని పదిహేను రోజుల ముందుగానే విడుదల చేసినట్టు జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం పురుషోత్తపట్నంలోని పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 1.40 లక్షల ఎకరాలకు 1,400 క్యూసెక్కుల సాగునీటిని, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి 60 వేల ఎకరాలకు పోలవరం ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ విడుదల చేశారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వారిని ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేయడం ద్వారా 31 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కాలువ పూడికతీత పనులు చేపట్టి సక్రమంగా సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చైత్రవర్షిణి, ఇరిగేషన్ ఎస్ఈ బి ఏసుబాబు, ఈఈలు రంగారావు, సీహెచ్ కోటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ


రఘుదేవపురం పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో నాగలత

సీతానగరం: రఘుదేవపురం పంచాయతీలో అవినీతి జరిగిందనే ఆరోపణలతో డీఎల్‌పీవో నాగలత, ఈవోపీఆర్డీ మూర్తి బుధవారం విచారణ నిర్వహించారు. 2023 సంబంధించి పంచాయతీ రికార్డులను ఈవోపీఆర్డీ తనిఖీ చేసి, ఖర్చులను ఎమ్ బుక్‌లో నమోదు చేయలేదని, చెల్లింపులకు రసీదులు, ఇంటి పన్నులకు సంబంధించిన రసీదులు సక్రమంగా లేవని గుర్తించారు. దీనితో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో విచారణ చేపట్టారు. అనంతరం రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, పంచాయతీ కార్యదర్శి డి అప్పారావు నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. రికార్డులను క్షుణంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో నాగలత తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఇతరులెవ్వరికీ ఓటీపీలు చెప్పకండి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ నిపుణులు సురేష్

రాజానగరం: సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని రాజమహేంద్రవరం సైబర్ క్రైమ్ నిపుణుడు వైఎస్‌వీ సురేష్, కేఆర్ అరవింద్ సూచించారు. దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, మాయమాటలతో బురిడీ కొట్టించేలా సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తుంటారన్నారు. సులభంగా రుణాలు ఇప్పిస్తామంటూ లోన్ యాప్స్ ద్వారా ఆశ చూపిస్తారని, ఆపై ఆన్‌లైన్ వేధింపులతో ఒకటికి పదింతలు లాక్కునేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఇటువంటి సమయంలోనే కొంతమంది అమాయకులు పెద్దలకు చెప్పలేక, సైబర్ నేరగాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పతున్నారన్నారు. వీటన్నిటినీ తప్పించుకోవాలంటే దురాశకు పోకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోరాదని విద్యార్థులకు సూచించారు. లక్కీడిప్‌లు, లాటరీల పేరుతో డబ్బులు ఆశ చూపి ఆన్‌లైన్‌లో, ఫోన్‌లో బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు అడిగితే ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలపై వెబ్‌సైట్‌లో సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ హెల్ప్ లైన్ సహకారం తీసుకోవాలన్నారు. సైబర్ ఆన్‌లైన్.జీఓవీ.ఇన్‌కు తెలియజేయాలన్నారు. సెల్‌ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్ కూడా ప్రమాదమేనన్నారు. ఈ విషయంలో పెద్దలతోపాటు పిల్లలు కూడా దూరంగా ఉండటం మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. నరేంద్ర, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ బి. సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం

మధురపూడి: ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని క్షయ, కుష్టు, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి డాక్టర్ వసుంధర వైద్య సిబ్బందికి సూచించారు. కోరుకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ, అవసరమైన వైద్య సహకారం అందించేలా చూడాలన్నారు. డయేరియా, జ్వర బాధితుల వివరాలు వెంటనే పీహెచ్‌సీకి తెలియజేయాలన్నారు. ఈనెల 18 నుంచి నిర్వహించనున్న ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) సర్వే ఆగస్టు 2 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి అనుమానిత చర్మ వ్యాధుల కేసును పీహెచ్‌సీకి పంపించాలన్నారు. అనంతరం గ్రామంలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించి, ఆరోగ్య సమస్యలు– తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రజ్ఞ, డాక్టర్ జ్ఞానచంద్ర, సునీల్, హెల్త్ సూపర్‌వైజర్లు కె. భారతీ, ఎం. లక్ష్మీకాంతం, ఏటీఎస్ శ్రీనివాస్, ఎస్‌టీఎల్ఎస్ అమృత, డీపీఎస్‌లు జగదీష్, సుందరి పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంత్యుత్సవం

రాజమహేంద్రవరం రూరల్: స్వాతంత్ర్యం కోసం పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని స్థానిక గోదావరి బండ్ ప్రాంతంలో గురువారం ఉదయం 10.30 గంటలకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు బుధవారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలను రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం గోదావరి బండ్ ప్రాంతంలో విద్యుత్ కార్యాలయం సమీపంలో వేడుకల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టరు పి.ప్రశాంతి, శాసన సభ్యులు హాజరవుతారన్నారు.

నేటి నుంచి నవరాత్రులు ప్రారంభం

సీటీఆర్ఐ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాల మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో గురువారం నుంచి వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమవుతున్నాయని పీఠాధిపతి గురు గోవింద శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్న బాబుస్వామీజీ తెలిపారు. ఈ గుప్త నవరాత్రుల్లో భాగంగా 11వ తేదీన వ్యాహాలక్ష్మికి మహాభిషేకం, 18న 54 కిలోల గంథంతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన గుడి మనసేవ, భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ గుప్త నవరాత్రులను పీఠంలో వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులపై వివక్ష తగదు

కంబాలచెరువు: ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులపై వివక్ష తగదని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో బుధవారం ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు ఆర్‌టీఈ యాక్ట్ 12/1 సీ ప్రకారం ఉచిత ప్రవేశాలు కల్పించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం నిబంధనలు పాటించకుండా విద్యార్థులను వివక్షతో చూస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులను వేరుగా కూర్చోబెట్టడం, ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడం వంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు పాఠశాలల యూనియన్ నాయకులు సురేష్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల యాజమాన్యాలు అధికారుల సూచనలు నూరు శాతం పాటించాలన్నారు.

ఆసక్తికరంగా టీచ్ టూల్ శిక్షణ తరగతులు

కంబాలచెరువు: మూడు రోజులుగా స్థానిక డీఎమ్ హెచ్ స్కూల్లో నిర్వహిస్తున్న టీచ్ టూల్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ఆసక్తికరంగా సాగుతున్నాయని కోర్స్ డైరెక్టర్ బి.దిలీప్ కుమార్ బుధవారం తెలిపారు. విషయ నిపుణులు ఉపాధ్యాయులతో ఆసక్తికరమైన తరగతి గది రూపొందించే కృత్యాలు నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారన్నారు. శిక్షణకు హాజరైన వారిని బృందాలుగా విభజించి కృత్య నిర్వహణ చేస్తున్నారన్నారు. సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు కరదీపికలు అందజేశామన్నారు. విషయ నిపుణులుగా ఎన్.శ్రీనివాస్, టి.ప్రవీణ్, శిరీష, రేఖ, స్వప్న, శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు జె.శ్రీనివాసరావు, కుమారి పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణుకు పరామర్శ

రామచంద్రపురం: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను బుధవారం పలువురు పరామర్శించారు. వేగుళ్ల లీలాకృష్ణ, రెడ్డి ప్రసాద్, కేవీపీ సత్యనారాయణ రెడ్డి, కొప్పూరి త్రినాథ్‌రెడ్డి, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పట్టణానికి చెందిన పలువురు వేణు మాతృమూర్తి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణు ఆయన కుటుంబీకులకు సంతాపం తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు, నాయకులు వేణును పరామర్శించారు.

గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి


ఎస్‌కే నాగేంద్రకుమార్

కరప: గురజనాపల్లి, కరప గ్రామాల గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్‌కు గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రాగా, బుధవారం ఎంపీడీఓ కె.అప్పారావు ఆయనను రిలీవ్ చేశారు. గురజనాపల్లి పంచాయతీ కార్యదర్శిగా జి.దుర్గాభవానికి, కరప కార్యదర్శిగా కె.కేశవరావుకు బాధ్యతలు అప్పగించారు. నాగేంద్రకుమార్‌కు పదోన్నతి లభించడంతో కరప మండలం నుంచి బదిలీ కాగా, పెదపూడి మండలం జి.మామిడాడ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

కడియం: వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. యాక్షన్ ప్లాన్, విలేజ్ ప్రొఫైల్‌ను ప్రతి పంచాయతీ కార్యదర్శి సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ పంతం గణపతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి


విద్యార్థులకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తున్న డీఈఓ వాసుదేవరావు

రాజానగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, అప్పుడే అంతా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు అన్నారు. మండలంలోని పల్లకడియం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. చిన్నారులకు స్టూడెంట్స్ కిట్ల పంపిణీతోపాటు అడ్మిషన్స్‌పై ఉపాధ్యాయులతో సమీక్షించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కొద్దిసేపు మమేకమయ్యారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల ఆవరణ, పరిసరాల్లో మురుగు లేకుండా శుభ్రం చేయాలని, దోమలు, ఈగలు చేరకుండా తరచు బ్లీచింగ్ చల్లాలన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు ఎంఈఓ 2 జ్యోతి ప్రసాద్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


సీతానగరంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన దుర్గారాధను అభినందిస్తున్న హెచ్ఎం సతీష్‌బాబు, ఉపాధ్యాయులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన వి.వీరవెంకటదుర్గారాధ ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు కస్నూరి సతీష్‌బాబు బుధవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని దుర్గా రాధను ఉపాధ్యాయులు సూర్యకుమారి, విశాలాక్షి, నిర్మల కుమారి, బ్రహ్మాజీ, తమ్మయ్య, ముస్తాఫా, శ్రీనివాస్, ఉమాదేవి, సరళ తదితరులు అభినందించారు.

వరి ఆకుమడుల పరిశీలన


పురుషోత్తపట్నంలో వరి ఆకుమడులను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

సీతానగరం: పురుషోత్తపట్నం వరి ఆకుమడులను, విత్తనాలు వెదజల్లిన పొలాలను జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు పరిశీలించారు. బుధవారం పురుషోత్తపట్నంలో ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. వరి నాట్లు వేసే ముందు దమ్ములో నత్రజని, భాస్వరం ఎరువులతో పాటు ఎకరానికి 20 కిలోల పొటాష్ వేసుకుంటే పిలకలు గట్టిగా, దృఢంగా ఏర్పడి పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి పైరుకు వస్తుందని రైతులకు ఆయన వివరించారు. ఈయనతోపాటు ఏడీఏ బి.మల్లికార్జునరావు, ఏవో కె.సూర్యరమేష్, వీఏఏ ఎమ్.శాంతి, రైతులు ఉన్నారు.

సొసైటీ సభ్యులంతా కేవైసీ చేయించుకోవాలి

రాజానగరం: నందరాడ సొసైటీ పరిధిలోని సభ్యులంతా కేవైసీ చేయించుకోవాలని సీఈఓ బోళ్ల సూర్యచంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. సొసైటీ పరిధిలోని నందరాడ, నరేంద్రపురం, కలవచర్ల, సీతారామపురం గ్రామాల సభ్యులు తమ ఆధార్ కార్డు, పాన్ నంబరు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకువచ్చి, సొసైటీలో సభ్యత్వాన్ని ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీల్లో చేపట్టిన కంప్యూటరైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ తప్పనిసరి అని పేర్కొన్నారు. సభ్యులు ఆన్‌లైన్‌లోనే సొసైటీ పరంగా తమ వివరాలు తెలుసుకునేందుకు, సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు దీని ద్వారా అవకాశం ఉంటుందన్నారు. భూపాలపట్నం, దివాన్‌చెరువు సొసైటీల సీఈఓలు కూడా తమ సొసైటీ పరిధిలోని సభ్యుల కేవైసీ వివరాలను అందించి, పూర్తి స్థాయి కంప్యూటరీకరణకు తోడ్పడాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు ప్రధాన కూడలిలో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న గోకవరం మండలం తిరుమలాయపాలెనికి చెందిన పినమరెడ్డి కొండలరావు (44) బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బైకుపై పాలచర్ల వైపు నుంచి శ్రీరామపురం వెళ్లేందుకు దివాన్ చెరువు ప్రధాన కూడలిలో రోడ్డు దాడుతున్నాడు. అతడిని విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.